క్లుప్తంగా

విరబూసిన బ్రహ్మకమలం



రంగనాథం ఇంట్లో పూసిన బ్రహ్మకమలం

రాజాం: ఏడాదికి ఓసారి మాత్రమే పుష్పించే బ్రహ్మకమలం పుష్పం పట్టణంలోని రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం మాస్టారు ఇంట్లోని పెరట్లో పూసింది. అరుదైన ఈ పుష్పం మార్చి నెలలో ఎక్కువగా కనిపిస్తుంది. వీటిని చూసేందుకు చుట్టుపక్కల వారు ఇప్పుడు క్యూ కడుతుండడం విశేషం.

ఆనందరావు మృతికి పలువురి సంతాపం

రేగిడి: మిథునం చిత్రం నిర్మాత, ప్రముఖ సంఘ సేవకులు మొయిద ఆనందరావు మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, గేదెల వెంకటేశ్వరరావుతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులంతా వావిలవలసలోని ఆయన పార్థివదేహం వద్దకు చేరుకుని, నివాళులర్పించారు.

బాడంగిలో అకాల వర్షం

బాడంగి: మండల కేంద్రంలో అకాల వర్షం కురిసింది. గురువారం సాయంత్రం 4 గంటల నుంచి దాదాపు గంట కాలం పాటు వర్షం పడింది. మరో నాలుగు రోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



లక్ష్మీపురంలో ద్రవజీవామృతం తయారు చేసి చూపిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బాడంగి: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని లక్ష్మీపురం, తెంటువలస గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానం, అగ్ని అస్త్రం, ద్రవజీవామృతం, ఘనజీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా సేంద్రియ ఎరువులను వాడితే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ఆవరణలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీఏటా నిర్వహిస్తున్న ఈ జాతరను పురస్కరించుకుని, అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందని ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. దాదాపు 6 వేల మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీడీవీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధితురాలికి వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ నగర్ కాలనీకి చెందిన మాణిక్యం రమణ మృతి చెందడంతో ఆయన భార్య నిర్మలకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను కమిషనర్ డీటీవీ కృష్ణారావు గురువారం అందజేశారు. త్వరలోనే మిగతా మొత్తం చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది



సంతకవిటి: ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి, తదితరులు



తెర్లాం: పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు



తెర్లాం: గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణమూర్తి, విద్యార్థులు



బొబ్బిలి రూరల్: తహసీల్దారు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న రెవెన్యూ అధికారులు



రాజాం: కొత్తవలస గ్రామంలో పొట్టి శ్రీరాములు జయంతిలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు తిరుమలరావు



రాజాం సిటీ: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



రామభద్రపురం: తహసీల్దార్ కార్యాలయంలో అమరజీవికి నివాళులర్పిస్తున్న తహసీల్దారు సాయికృష్ణ



బొబ్బిలి: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



రామభద్రపురం: ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రమామణి, సిబ్బంది

ఆంధ్ర రాష్ట్ర పితామహుడు, అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. భాషా ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు నడుంబిగించి, అసువులు బాసిన గొప్ప పోరాటయోధుడు పొట్టి శ్రీరాములు అని, ఆయన ప్రాణత్యాగం మరువలేనిదన్నారు. ఆయన కృషి ఫలితంగానే 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకుని జీవించాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్

జోరుగా ఉపాధి పనులు



రాజాం: ఉపాధి పనుల వద్ద వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీఓ సాయిరాం



రేగిడి: వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ హరనాథరావు



బొబ్బిలి రూరల్: కారాడలో మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీడీ జనార్దనరావు

రాజాం: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. గడిముడిదాం, ఆగూరు గ్రామాల్లో జరుగుతున్న పనులను ఏపీఓ సాయిరాం గురువారం పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న వారికే పనులకు అనుమతించాలని, పనిచేసిన వారికే మస్తరు వేయాలని సూచించారు. నిర్దేశిత కొలతల్లో రెండు పూటలా పనిచేసి, గిట్టుబాటు అయ్యే వేతనం పొందాలన్నారు. కార్యక్రమంలో టీఏ పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామ వావిలపల్లివాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ హరనాథరావు పరిశీలించారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని ఏపీఓ సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు ఉండేలా చూసుకోవాలన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీడీ జనార్దనరావు గురువారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేయాలని, వేసవికాలం దృష్ట్యా రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో(ఎండ అంతగా లేనప్పుడు) పనులు చేయాలని తెలిపారు. ఆయన వెంట ఏపీఓ జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్మీడియట్ పరీక్షలు



తెర్లాం: పెరుమాళిలో విద్యార్థులు పరీక్షలు రాయడాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బాడంగి: అన్ని చోట్ల ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరీక్ష కేంద్రం చీఫ్‌లు టి.రాంబాబు, వి.శంకరరావు కలిసి గురువారం పరిశీలించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. గురువారం ఇంటర్మీడియట్ సెకెండియర్ తెలుగు, సంస్కృతం పరీక్షలు జరగ్గా, ఈ పరీక్షలకు గురుకుల కళాశాలలో ఇద్దరు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ..

తెర్లాం: మండలంలోని పెరుమాళి ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దారు డోల రాజేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరు, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మిని ఆరాతీశారు. ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కాపీయింగ్‌కు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బొబ్బిలి: పట్టణ పరిధిలోని ఆరు కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. గురువారం పరీక్షలకు విద్యార్థులంతా హాజరై, చక్కగా రాశారు.

బయోమెట్రిక్ తప్పనిసరి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: గ్రామసచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు, వలంటీర్లంతా తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు 90 శాతం దాటని ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్షించిన ఆయన బయోమెట్రిక్ హాజరు వేయడం తప్పనిసరి అని, హాజరు నమోదులో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. అందరూ 100 శాతం మేర బయోమెట్రిక్ హాజరు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాంబాబు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బొబ్బిలి రూరల్: స్థానిక పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయం వద్ద పంచాయతీరాజ్ ఉద్యోగులు గురువారం నిరసనకు దిగారు. సకాలంలో జీతాలు ఇవ్వాలని, డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉద్యోగ సంఘ నాయకులు సీహెచ్‌వీ అప్పారావు, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదు, ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బీవీ పూర్ణచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో 2022–23 సంవత్సరంలో విద్యార్థులు నాలుగో తరగతి, పదో తరగతి చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం లక్ష రూపాయల లోపు ఉండాలన్నారు. ఈ నెల 24లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఇంటర్‌లో చేరే విద్యార్థులు జూన్ 31, 2023 నాటికి 17 సంవత్సరాల వయసు మించకూడదని.. ఐదో తరతిలో చేరాల్సిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ నుంచి 2014 ఆగస్టు 31 లోపు జన్మించి ఉండాన్నారు. అలాగే బీసీ, ఓసీ విద్యార్థులు 2012 సెప్టెంబర్ నుంచి 2014 ఆగస్టు లోపు జన్మించి ఉండాలని పేర్కొన్నారు.

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు



డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: మండల కేంద్రంలోని బస్టాండ్ వెనక వీధిలో డ్రైనేజీ(కాలువ) నిర్మాణ పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. గురువారం నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేయాలన్నారు. దాదాపు రూ.20 లక్షల వ్యయంతో సీసీ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత కనగల పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల సామగ్రి పంపిణీ



హెచ్‌ఎంలకు మరుగుదొడ్ల సామగ్రి అందిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. గురువారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో పాఠశాలల మరుగుదొడ్లకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు చక్కగా అందేలా చూడాలన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు

రాజాం: పట్టణ పరిధిలోని కొత్తవలస గ్రామ పీఎంఎల్ కాంప్లెక్స్ ఏరియాలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. గురువారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక అనకాపల్లి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు, పలు షాపుల వద్దకు వెళ్లి, త్రైత సిద్ధాంతం గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రమణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



వంగర: పాఠశాలలో ఉపాధ్యాయుడి బోధనను పరిశీలిస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈఓ వై.దుర్గారావు సూచించారు. గురువారం మండలంలోని మగ్గూరు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఆయన రికార్డుల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం అమలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. అంతకుముందు వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



బొబ్బిలి రూరల్: చలివేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్ రాజారావు

రాజాం: మండలంలోని మొగిలివలస జంక్షన్ వద్ద ప్రధాన రోడ్డులో మజ్జిగ చలివేంద్రం గురువారం ప్రారంభించారు. రాజాంకు చెందిన అమృత హాస్పిటల్ ఎండీ గార రవిప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామానికి చెందిన యువత తెలిపారు. వారం రోజుల పాటు మజ్జిగ చలివేంద్రం నడుపుతామని, అనంతరం తాగునీరు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మొగిలివలస గ్రామానికి చెందిన యువకులు ఎం.హరి, ఐ.గణేష్, ఐ.అప్పలనాయుడు, ఎం.అనీల్, ఐ.లక్షుంనాయుడు, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దారు ఎస్.రాజారావు ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేయగా, శుక్రవారం నుంచి ప్రతిరోజూ తాగునీరు అందుబాటులో ఉంటుందని తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



నందిగాంలో ర్యాలీ చేస్తున్న ఏఓ సునీల్‌కుమార్

తెర్లాం: మండలంలోని నందిగాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ముందు పొలాల్లో నవధాన్యాలను సాగు చేయడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతులంతా తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాల సాగుతో పాటు 18 నుంచి 30 రకాల విత్తనాలు చల్లుకోవచ్చన్నారు. వరి సాగుకు ముందు దమ్ములో ఈ పంటలను దున్నేయాలని, దీంతో నేల సారవంతమవుతుందన్నారు. ఇది పంటకు మంచి ఎరువుగా కూడా ఉపయోగపడుతుందన్నారు. అలాగే రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

తెర్లాం: జడుపు(గాలికుంటు) వ్యాధి సోకకుండా 4 నెలల వయసు దాటిన పశువులన్నింటికీ వ్యాక్సిన్లు వేయాలని మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్, 1962 కాల్ సెంటర్ డాక్టర్ గిరీషా సూచించారు. మండలంలోని పెరుమాళి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు సేవా కేంద్రం(1962 మొబైల్ వెహికల్)ద్వారా గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు వైద్య తనిఖీ చేసి, 158 పాడి పశువులకు జడుపు వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో పశువులు బాధపడితే 1962 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని, వెంటనే మొబైల్ వాహనంతో సిబ్బంది వచ్చి, పశువులకు ఆరోగ్య తనిఖీలు చేస్తారన్నారు. రైతులంతా డాక్టర్ వైఎస్సార్ సంచార పశు సేవా కేంద్రం సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, సచివాలయ ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.


పక్కాగా భూ సరిహద్దుల గుర్తింపు



సర్వే సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దారు రాజేశ్వరరావు

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా చేపడుతున్న భూముల రీసర్వే కార్యక్రమంలో రైతుల జిరాయితీ భూములతో పాటు, ప్రభుత్వ, బంజరు, గెడ్డ పోరంబోకు తదితర భూములకు పక్కగా సరిహద్దులు గుర్తించాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని నెమలాం గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను గురువారం పరిశీలించిన ఆయన గ్రామంలోని అన్ని రకాల భూములకు సరిహద్దులు గుర్తించాలన్నారు. సరిహద్దుల గుర్తింపులో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హద్దులు గుర్తించినప్పుడు సంబంధిత రైతులతో పాటు చుట్టుపక్కల రైతులను కూడా దగ్గర ఉంచాలన్నారు.

చెరకులో ఎర్రకుళ్లు తెగులు పరిశీలన



రేజేరు గ్రామంలో ఎర్రకుళ్లు తెగులు సోకిన చెరకు పంటను పరిశీలిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: మండలంలోని రేజేరుతో పాటు పలు గ్రామాల్లో సాగులో ఉన్న చెరకు పంటకు సోకిన ఎర్రకుళ్లు తెగులును మండల వ్యవసాయాధికారి కె.శిరీష గురువారం పరిశీలించారు. చీడపీడలు, తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. అంతకుముందు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం సందర్శించిన ఆమె రబీ పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదుపై ఆరాతీశారు. పీఎం కిసాన్ లబ్ధి పొందేందుకు రైతులంతా ఈ నెల 31వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఏఈఓ పుష్పలత, వ్యవసాయ సహాయకులు సాయికుమార్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు



బోరు బాగుచేస్తున్న మెకానిక్ కృపారావు

వంగర:

మండలంలోని కింజంగి గ్రామంలో ఉన్న ప్రధాన వీధి, ఎస్సీ కాలనీల్లో తాగునీటి బోర్ల మరమ్మతులు గురువారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. గత కొన్నాళ్లుగా అవి పనిచేయకుండా ఉండిపోవడంతో తాగునీటి కోసం అక్కడి వారు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ నేత బొంతు వెంకటరావు ఆధ్వర్యంలో ఉదయం మెకానిక్ కళింగ కృపారావు బోర్లు బాగు చేసి, వినియోగంలోకి తీసుకువచ్చారు.